క్లుప్తంగా

వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన బాలికలు



బొంరాస్‌పేట బాలికల వాలీబాల్ టీమ్

బొంరాస్‌పేట: జిల్లా స్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో బొంరాస్‌పేట మండల బాలికలు ప్రతిభను కనబర్చారు. శనివారం తాండూరులో జరిగిన పోటీల్లో అండర్- 17 బాలికల విభాగంలో కుల్కచర్లతో హోరాహోరీగా తలపడి రెండో స్థానంలో నిలిచారు. టీమ్ లీడర్ వైష్ణవి, బొంరాస్‌పేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పూజ, జాన్సి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



బ్యాంకు అధికారిని నిలదీస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

బొంరాస్‌పేట: రైతులను ఇబ్బంది పెట్టొద్దని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రైతులకు సరైన సేవలు అందడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై బాధితులు అనేకసార్లు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ విషయంలో పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనైనా పనితీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు, కిష్టప్ప, మల్లికార్జున్, సూర్య ప్రకాశ్‌గౌడ్, సంతోష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్‌కు మద్దతుగా నిలవాలి



ఎమ్మార్సీ ఎదుట మాట్లాడుతున్న యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గోపాల్

బొంరాస్‌పేట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడే తెలంగాణ ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)కు మద్దతుగా నిలవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రం ఎదుట శనివారం 2025 విద్యా సంవత్సరం క్యాలెండర్, డైరీ, అధ్యాపక దర్శిని పంపిణీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు మల్లేశం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై సమీక్ష



జెడ్పీహెచ్ఎస్‌లో పీటీఎం సమావేశం

బొంరాస్‌పేట: పాఠశాల, విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని ఎంఈఓ హరిలాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతోపాటు టేకులగడ్డ తండా, తదితర పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం)లు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యాబోధన, అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర కార్యక్రమాలు, పథకాల అమలు పట్ల సమీక్షించారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో వచ్చిన నాణ్యత, మార్పు పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గౌరారం గోపాల్, ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, వెంకటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత



దుద్యాల్ పాఠశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

దుద్యాల్: ధ్యానంతో ఆలోచన శక్తి పెంపొందించుకోవచ్చని మండల విద్యాధికారి విజయరామారావ్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ధ్యానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. చిన్నారులు, యువత ధ్యానం చేస్తే ఆలోచనా శక్తి, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు.

రామానుజన్ కృషి మరువలేనిది

వికారాబాద్, తాండూరు పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో శనివారం గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు రామానుజన్ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. రామానుజన్ గణితంపై చేసిన విశేష కృషిని కొనియాడారు. నేటి సమాజంలో గణిత ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



అనంతగిరి: కొత్తగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత మేళా



కొడంగల్ రూరల్: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



బొంరాస్‌పేట: బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ రాఘవేందర్ యాదవ్



తాండూరు రూరల్: కరన్‌కోట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో..



బంట్వారం: కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు

కంకర రోడ్డుతో కష్టాలు!



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లిలో కంకర వేసి వదిలేసిన రోడ్డు

- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో వాహనదారులు

మోమిన్‌పేట: గుంతలు, కంకర రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని మండల పరిధిలోని ఎన్కేపల్లివాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎన్కేపల్లి వరకు రెండు కిలోమీటర్ల పంచాయితీరాజ్ రహదారి ఉంది. 2013లో కిలోమీటరున్నర రోడ్డును బీటీగా మార్చారు. మరో అరకిలోమీటరు మేర గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీన్ని బాగు చేసేందుకు ఎనిమిదేళ్ల క్రితం రోడ్డు, ఓ కల్వర్టు నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు చేశారు. ఎనిమిది నెలల క్రితం వరకు టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆతర్వాత కల్వర్టు నిర్మించి, రోడ్డును తవ్వి కంకర వేశారు. 2013లో వేసిన బీటీ రోడ్డు కూడా ప్రస్తుతం గుంతలమయమైంది. మర్పల్లి, వీర్లపల్లి, సిరిపురం, కోత్లాపూర్, మర్పల్లి, బూచన్‌పల్లి, పట్లూరు తదితర గ్రామాల నుంచి వికారాబాద్ వెళ్లేందుకు ఎన్కేపల్లి రోడ్డే అందుబాటులో ఉంది. దీంతో వాహనాదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాస్తారోకోలో ఏఎన్‌ఎంలు

బొంరాస్‌పేట: కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టిన రాస్తా రోకోలో మండల కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. శనివారం ఆ సంఘం మండల నాయకులు లీలావతి నేతృత్వంలో పెద్ద ఎత్తున కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు తరలివెళ్లారు. ఈనెల 29న నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6వేల మంది కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. రాత పరీక్షను అడ్డం పెట్టి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు వెంకటమ్మ, భారతి, రోజా, రజియా, శాంత, సుహాసిని, సుష్మా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు

అనంతగిరి: కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్‌టీఆర్ చౌరస్తాలో కాంట్రాక్టు వారు తమ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు రద్దు చేయాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాయకులు వెంకటమ్మ, భారతి, సుహాసిని, మంజుల, స్రవంతి, రజియా, పద్మ, సల్మా, సుజాత, స్వరూప, చంద్రకళ, రాములమ్మ, తిరుపతమ్మ, అనిత, యాదమ్మ, రోజా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలి



ఐలమ్మ వేషధారణలో కృష్ణవేణి

యాలాల: విద్యాశాఖలో పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం 14వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శనివారం యాలాల కేజీబీవీ సీఆర్‌టీ(కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్) కృష్ణవేణి చాకలి ఐలమ్మ వేషధారణలో సమ్మెకు హాజరయ్యారు. సమగ్ర ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు తరలివెళ్లిన వారిలో కేజీబీవీ ఎస్‌ఓ మంగమ్మ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సర్వర్, సీఆర్‌టీలు క్రిష్ణవేణి, మమత, శ్రీనివాస్, ఇస్మాయిల్, మొగులప్ప, వెంకటేశతదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇంచార్జి పశువైద్యాధికారి ఆనంద్

దోమ: పశువులకు సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి పశువైద్యాధికారి ఆనంద్ అన్నారు. శనివారం సాక్షి దినపత్రికలో పశువైద్యం దయనీయం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు బొంపల్లి తండాలో 18 లేగ దూడలు, 58 ఆవులు, 56 మేకలకు చికిత్సలు నిర్వహించి మందులు అందించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి ఉప కేంద్రం లైవ్‌స్టాక్ అధికారి(వీఎల్‌ఓ)స్వప్న, కంపౌండర్లు బాబయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



బొంపల్లితండాలో పశువులకు వైద్యం అందిస్తున్న ఇంచార్జి పశువైద్యాధికారి ఆనంద్

ఉపాధిహామీ పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డిఓ శ్రీనివాస్

డీఆర్‌డిఓ శ్రీనివాస్

కొడంగల్ రూరల్: గ్రామాల్లో ఉపాధిహామీ పనులను సోమవారం నుంచి ప్రారంభించాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాల్లో దౌల్తాబాద్, కొడంగల్ మండలాల సాంకేతిక, క్షేత్ర సహాయకులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, ఏపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పనులు చేపట్టాలన్నారు. ఫిష్ పాండ్స్, నాడెప్ కాంపోస్టు ఫీట్స్, వర్మీ కంపోస్ట్ ఫీట్స్, అజొల్లఫిట్స్, పశువుల షెడ్లు, మేకల షెడ్లు తదితర వాటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అంతకుముందు హస్నాబాద్ గ్రామంలోని నర్సరీలతోపాటు హర్టికల్చర్ కింద మామిడి తోటల పెంపకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరళకుమారి, కొడంగల్, దౌల్తాబాద్ ఎంపీడీఓలు ఉషశ్రీ, శ్రీనివాస్, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ రాములు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు బాధ్యత హెచ్‌ఎంలదే

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాల్లో కొనసాగే మధ్యాహ్న భోజన పథకంలో నిబంధనలు పాటించాలని ఎంఈఓ వెంకటయ్య హెచ్‌ఎంలను ఆదేశించారు. తాండూరు సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మెనూ పాటించాలని, స్టాక్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.



హెచ్‌ఎం సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీ బలోపేతానికి కృషి

బంట్వారం: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు గజ్జల అశోక్ అన్నారు. శనివారం కోట్‌పల్లి మండలంలోని ఇందోల్ గ్రామంలో 32వ బూత్ అధ్యక్షుడిగా బోయిని నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబిక, రాజు, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా అశోక్



మర్పల్లి: తెలంగాణ జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జి అశోక్ (జెడ్పీహెచ్ఎస్ ఘణాపూర్) నియమితులయ్యారు. శనివారం రాష్ట్ర జీహెచ్‌ఎంఏ కార్యవర్గం నియామక ఉత్తర్వులు అందజేసినట్లు అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

◆ సర్వేలో నిర్లక్ష్యం తగదు

దోమ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో నిర్లక్ష్యం తగదని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. శనివారం దోమ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తహసీల్దార్ పురుషోత్తంతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన ఎస్‌ఐ గఫార్‌కు సన్మానం

బంట్వారం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్‌ను పలువురు నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జ్ఞానేశ్వర్, సమ్మయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలి

తాండూరు రూరల్: విద్యార్థులు ధ్యానం చేయాలని చెంగోల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్‌ఎం పర్సా నాయక్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా చెంగోల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు.

ముమ్మరంగా 'ఇందిరమ్మ' సర్వే



దారూరు: అల్లీపూర్‌లో కొనసాగుతున్న సర్వే



మోమిన్‌పేటలోని ఏన్కతలలో ఇందిరమ్మ ఇళ్లను సర్వే చేస్తున్న ఎంపీఓ యాదగిరి

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రక్రియ

ధారూరు: ధారూరు మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. అల్లిపూర్‌లో కార్యదర్శి వెంకటదాసు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణలో ఇళ్ల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామంలో 350 కుటుంబాలు ఉండగా..190 కుటుంబాల సర్వేను పూర్తి చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మోమిన్‌పేట: గ్రామాల్లో చేపట్టుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీఓ యాదగిరి అన్నారు. మండల పరిధిలోని ఏన్కతలలో చేపట్టుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తుదారుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని, సర్వే చేయాలన్నారు. మండల పరిధిలోని 28 జీపీల నుంచి మొత్తం 12,400 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందుకు సంబంధించి త్వరలోనే క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నర్సింలు తదితరులు ఉన్నారు.



బొంరాస్‌పేట: దరఖాస్తుదారుని వద్ద సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకన్నగౌడ్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై అపోహలు వద్దు

బొంరాస్‌పేట: ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ పథకం అర్హుల గుర్తింపు కోసం చేస్తున్న సర్వే అధికారుల పట్ల ఎలాంటి అపోహలు వద్దని ఎంపీడీఓ వెంకన్న గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, బొట్లోనితండాలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించారు. పథకం కింద వచ్చిన దరఖాస్తుల సర్వేపై సంతృప్తి వ్యక్తంచేశారు. అర్హులైన వారికి తప్పనిసరిగా ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల పరిధిలోని అంతారం ప్రాథమిక పాఠశాలలో శిక్షణ(ప్రేరణ) అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు టీవీ, ఇంటర్నెట్ సౌకర్యం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల ఉన్నతికి టీవీ, ఇంటర్నెట్ సౌకర్యం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, ఉపాధ్యాయ బృందం భూదేవి, వెంకటయ్య, లావణ్య, కవిత, శ్రావణి, కుమారి, రోహిన్ కుమార్, టి.వెంకటయ్య, శిక్షణ ఫౌండేషన్ మెంటర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



టీవీ, ఇంటర్నెట్ సేవలను ప్రారంభిస్తున్న ఎంఈఓ హబీబ్ అహ్మద్

నోరూరించే వంటలు..



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న హుస్సేన్‌పూర్ పాఠశాల హెచ్‌ఎం క్రాంతికుమార్



స్నాక్స్ తయారు చేసిన బాలికలు



పూడురు: ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బాలికల ఉర్దూ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

తాండూరు టౌన్: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకని పట్టణంలోని మాణిక్‌నగర్ ప్రభుత్వ బాలికల (ఉర్దూ) ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. బాలికలు పలు రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. బిర్యానీ, పలావు, ఫ్రూట్ సలాడ్, దోశ, వడ, ప్లమ్ కేక్, బ్రెడ్, చపాతి, పోలెలు, పాన్, జ్యూస్, టీ, పులిహోర, కీర జ్యూస్, గులాబ్‌జామూన్, బిర్యానీ, డబల్‌కమీట వంటి రకరకాల వంటకాలతో బాలికలు అలరించారు. విద్యతో పాటు ఇంకా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. పలు రకాల వంటకాలను తయారు చేసిన బాలికలను ఆమె అభినందించారు.



అల్పాహారంతో విద్యార్థిని

అలరించిన ఆహారోత్సవాలు

కొడంగల్ రూరల్: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించిన ఆహారోత్సవాలు అలరించాయి. హుస్సేన్‌పూర్, అయినన్‌పల్లి స్కూళ్లలో విద్యార్థులు విభిన్నమైన వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు క్రాంతికుమార్, మౌనిక, ఉపాధ్యాయులు సంధ్య, కావ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూడూరు: ప్రతి రోజు పౌష్టిక అహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఎదిగేందుకు వీలుంటుందని చిరుతిళ్లకు అలవాటు పడి ఆరోగ్యాలు పాడు చేసుకోవద్దని కద్మూరు పాఠశాల హెచ్‌ఎం మధు అన్నారు. శనివారం స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచి వండి తీసుకువచ్చిన ఆహార పదార్థాలను పరిశీలించి, అభినందించారు.